వెదసాగుతో అన్నదాత వ్యథ

- వర్షపు నీటిలో నానుతున్న వెదసాగు మడులు
- గింజ ముదిరితే నష్టం తప్పదని వాపోతున్న కర్షకులు

భట్టిప్రోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వెద సాగు చేపట్టిన పైరులో వర్షానికి నీరు నిలబడటంతో మొలక శాతం తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భట్టిప్రోలు మండలంలో 15 వేల ఎకరాలు సాగుబడిలో ఉండగా దీనిలో సుమారు 500 ఎకరాల వరకు మొలక దశలో ఉన్న పొలాలు నీటిలో ఉన్నాయి. విత్తనాలు ఐదారు రోజులు లోపు నీటిలో ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని.. ఆ తరువాత గింజ మురిగిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ఇప్పటికే రైతాంగం వెద పద్ధతిన ఎకరాకు రూ.5 వేల నుంచి 7 వేల వరకు విత్తనాలతో కలుపుకుని ఖర్చు చేశారు. ఈ వర్షానికి విత్తనాలు మురిగిపోతే అదనపు భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. మురుగు కాల్వలు సక్రమంగా లేకపోవడంతో పంట పొలాల్లో వర్షపు నీరు రోజుల పర్యంతం నిలబడే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కాల్వల్లో తూటికాడ, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు ఇంతటితో ఆగితే బాగుంటుందని రైతులు మొక్కుతున్నారు.


భట్టిప్రోలులో వెదపద్ధతిలో సాగు చేస్తున్న పంట పొలాల్లో వర్షపు నీరు

కళకళలాడుతున్న మెట్ట పొలాలు

వర్షాలకు మెట్ట పైరులు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది కంద, అరటి పంటలు ఎక్కువగా సాగు చేసేందుకు మొగ్గు అన్నదాతలు చూపారు. మండలంలో ఎక్కువగా చింతమోటు, పెదలంక, పెసర్లంక, పెదపులివర్రు, ఓలేరు, గొరిగపూడి తదితర గ్రామాలలో ఈ పంటలు సాగుబడిలో ఉన్నాయి.

వర్షపు నీటిని బయటకు పంపాలి

వెద పద్ధతిలో సాగుచేసిన పంట పొలాల్లో వర్షపు నీటిని వెంటనే బయటకు పంపేలా చూడాలి. మొలకరాని గింజ ఐదు రోజుల వరకు నీటిలో ఉన్నప్పటికీ ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఆ తరువాత నీటిలో నాని మురిగిపోయి మొలకశాతం తగ్గుతుంది.

–జి. మీరయ్య, మండల వ్యవసాయాధికారి, భట్టిప్రోలు.

నీట మునిగిన వెదవరి సాగు రక్షణకు సూచనలు

వేమూరు: అల్పపీడనం ప్రభావం వల్ల రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మునిగి పోయిన వెద వరి సాగుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏరువాక కేంద్రం బాపట్ల కోఆర్డినేటర్ ఆర్ బాలమురళీధర్ నాయక్ శనివారం తగు సూచనలు చేశారు. వెదవరి విత్తుకొని మొలకరాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని సకాలంలో బయటకు పంపించినట్లయితే మొలక రావటానికి అవకాశం ఉందన్నారు. 10 నుంచి 30 రోజులలోపు పొలాల్లో నిల్వ నీటిని తీసి వేయాలి. వర్షం తగ్గిన తర్వాత ఎకరానికి ఒక బస్తా డీఏపీ, 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత వర్షపునీరు 15 నుంచి 20 రోజులు నిల్వ ఉన్న పొలాల్లో 100 మి.లీ బిస్పైరిటాక్ సోడియం 10 శాతం, లేదా ట్రైయఫామాన్ ఇథాక్సిసల్ఫ్యూరోస్ 30 శాతం మందును ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి పొలంలో కలుపు నివారణకు పిచికారీ చేసుకోవాలన్నారు. విత్తిన 25 రోజుల నుంచి 30 రోజుల మధ్య 8 గ్రాములు మెట్ సెల్ఫ్యూరాన్ మిథైల్, క్లోరిమూరున్ మందును ఎకరానికి 200 లీటర్లు నీటిలో కలిపి కలుపు నివారణకు పిచికారీ చేయాలని తెలిపారు. దీంతో ఆశాజనకమైన పంట దిగుబడులు సాధించేందుకు అవకాశముందన్నారు. అన్నదాతలు అందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రేపల్లె ఆర్డీవో హేలాషారోన్
- పెదలంక, కాకులడొంక రేవుల వద్ద వరద ముప్పుపై పరిశీలన

భట్టిప్రోలు: వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ కోరారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు వరద నీరు వదులుతుండటంతో శనివారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలసి పెదలంక, కాకులడొంక రేవుల వద్ద పరిస్థితిని స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థానికులు రేవులోకి వెళ్లవద్దని ఆదేశించారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద ఉధృతి కారణంగా దిగువకు నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. దిగువకు నీరు విడుదల కావడంతో నదీ పరివాహక ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండేలా రెవిన్యూ శాఖతో పాటు పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఆర్‌సీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల రెవెన్యూ అధికారులకు తెలియజేస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం నదిలోకి వెళ్లకుండా పశువులు, గొర్రెలు, మేకలు తోలుకుని జాగ్రత్త పడాలని కోరారు. భట్టిప్రోలు మండలంలో కృష్ణానది ప్రవహిస్తున్న నదిని ఆనుకుని ఉన్న గ్రామాలైన ఓలేరు, పల్లెపాలెం, పెదలంక మధ్యగూడెం, పెసర్లంక పల్లెపాలెం, చింతమోటు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు.వరద పెరిగితే మండలంలోని లంక గ్రామాల్లోని పెదపులివర్రు–పెసర్లంక, ఓలేరు–పెసర్లంక, కోళ్లపాలెం–పెసర్లంక చప్టాలపై రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. అనంతరం భట్టిప్రోలులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


రేవు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న ఆర్డీవో హేలా షారోన్ పక్కన అధికారులు, ప్రజాప్రతినిధులు

వర్షాకాలంలో పశుపోషణపై దృష్టి పెట్టండి

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు

బాపట్లటౌన్: వర్షాకాలంలో పశువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు తెలిపారు. మండలంలోని వెస్ట్ బాపట్ల గ్రామం, మహారుషి ఆశ్రమ గోశాలలో శనివారం తెల్ల పశువుల్లో వచ్చే ముద్ద చర్మవ్యాధి (లంపీ స్కిన్ డిసీజెస్) నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల్లో ఈ టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తెల్ల పశువులు అన్నింటికీ ఈ టీకాలు వేయించు కోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పశువులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పశువులు, మేకలు, గొర్రెలను షెడ్ లేదా పాకాల్లో మాత్రమే ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో తెల్లజాతి పశువుల్లో జబ్బవాపు వ్యాధి వచ్చే అవకాశముందన్నారు. దీని నివారణకు బీక్యూ వ్యాక్సిన్‌ను వేయించాలన్నారు. గేదెలకు గొంతువాపు వ్యాధి సోకితే గొంతువాపు, కాళ్ల వాపులతో పాటు జ్వరం వస్తుందని దీని నివారణకు హెచ్‌ఎస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. గొర్రెలకు ముఖ్యంగా నీలినాలుక వ్యాధి అధికంగా ప్రబలే ప్రమాదం ఉందని ఈ వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ముందుగా బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ టి.శంకరరావు, వెదుళ్లపల్లి పశువైద్యాధికారి డాక్టర్ బి.గోపికృష్ణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఆవులకు లంపీస్కిన్ నిరోధక టీకాలు వేస్తున్న హనుమంతరావు

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాయిబాబా మందిరంలో శ్రీ సాయినాథ–దత్తాత్రేయ స్వామి వార్ల గురుపౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు మురికిపూడి దుర్గాప్రసాద్ శర్మ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. శ్రీ సాయినామ ప్రచార కార్యక్రమంలో భాగంగా భక్తులు పురవీధులలో భిక్షాటన నిర్వహించారు. ఆబాలగోపాలం ఈ కార్యక్రమంలో పాల్గొని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రహదారుల వెంట దుకాణాలు, గృహాల వద్ద ఈ భిక్షాటన కొనసాగింది. కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించగా కార్యక్రమంలో కార్యదర్శి మెంటా సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భట్టిప్రోలులో భిక్షాటన నిర్వహిస్తున్న భక్తులు

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన తీసుకువచ్చేందుకు ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కో కన్వీనర్ రాయపూడి అంకమ్మ చౌదరి పేర్కొన్నారు. రేపల్లె పట్టణం 1వ వార్డులో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శనివారం ఆయన సందర్శించి అనంతరం మాట్లాడారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో జిల్లాలో పది దేవాలయాలు నిర్మాణం చేయటం జరిగిందని వీటిలో ఐదు దేవాలయాలు నూరుశాతం పూర్తవ్వగా మరో ఐదు దేవాలయాలల్లో 90 శాతం పైచిలుకు పనులు జరిగాయన్నారు. నూరుశాతం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, రేపల్లె మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, మోదడుగు సూరిబాబు, నంబూరి వేణు, వెంకటేశ్వరరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు సందేశమిస్తున్న అంకమ్మ చౌదరి

పారిశుద్ధ్యం మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ

మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

బాపట్ల: బాపట్ల పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వివేకానందకాలనీ, విజయలక్ష్మీపురంలో శనివారం పర్యటించారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్‌ను ఆదేశించారు. మంచినీటి పైపులైన్లు లీకులను వెంటనే నివారించాలని సూచించారు. కమిషనర్‌తోపాటు డీఈ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వివేకానందకాలనీలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

వ్యవసాయశాఖ ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్

నగరం: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమాచార హక్కుచట్టంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ 2005లో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు.ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు ఈ చట్టం దోహదపడుతుందన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, డీటీ ఎం శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి రమేష్‌బాబులు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


రేపల్లెలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

సమాచార హక్కుచట్టం వజ్రాయుధం

రేపల్లె రూరల్: సమాచార హక్కుచట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం వంటిదని ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు రేపల్లె మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ప్రజలకు శనివారం నిర్వహించిన సమాచార హక్కు చట్టం –2005పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల ద్వారా సామాన్య పౌరుడు తనకు అవసరమైన సమాచారం పొందేందుకు ఈ చట్టం చేయబడిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకతతో పాటు అవినీతిని కట్టడి చేసేందుకు ఏర్పాటు చేయబడిందే ఈ సమాచార హక్కు చట్టమని పేర్కొన్నారు. సమాచారం కావాలంటూ ఎవరైనా ఆయా కార్యాలయాలలో దరఖాస్తు చేసుకుంటే తప్పనిసరిగా అధికారులు సమాచారం అందించాలని చెప్పారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందన్నారు.సమావేశంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, ఏవో ఆర్.విజయ్‌బాబు, ఎంఈవో కేసనశెట్టి సురేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అవినీతి నియంత్రణే సమాచార హక్కుచట్టం ధ్యేయం

బాపట్లటౌన్: అవినీతి నియంత్రణే సమాచార హక్కుచట్టం ధ్యేయమని ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమాచార హక్కుచట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క అధికారి తమ కార్యాలయాల్లో సమాచార హక్కుచట్టం బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎంఈవో ఎస్. నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు గురించి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలకు కావలసిన సమాచారం సమాచార హక్కు చట్టం ద్వారా అందించే అవకాశం ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగకుండా సమాచార హక్కు చట్టం ద్వారా వారికి కావలసిన సమాచారాన్ని ఆయా శాఖల ద్వారా పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షులు ఆట్ల బాలాజీరెడ్డి, మండల అధికారులు, ప్రజలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

ఇంటి తాళాలు పగులగొట్టిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కోర్టు ఆదేశాలు లేకుండా బ్యాంకు సిబ్బంది న్యాయవాదులను వెంట బెట్టుకుని వచ్చి ఇంటి బయట గేటు తాళం పగులగొట్టి అక్రమంగా ప్రవేశించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తారకరామానగర్‌లోని హైమావతి నివాసాన్ని విజయకుమార్ కొనుగోలు చేశాడు. అయితే హైమావతి డబ్బులు తీసుకుని రిజిస్ట్రార్ చేయలేదు. విజయకుమార్ రిజిస్ట్రారు చేయాలంటూ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈనేపథ్యంలో శనివారం యూనియన్ బ్యాంకు సిబ్బంది, న్యాయవాదులను వెంట తీసుకుని ఇంటి గేటు తాళాలు పగులగొట్టి లోపలకు వప్రవేశించారు. సమాచారం తెలుసుకున్న విజయకుమార్ వారిని ప్రశ్నించగా, ఇల్లు బ్యాంకు తాకట్టులో ఉందని వారు తెలిపారు. అయితే వారి వద్ద కోర్టు ఆర్డర్లు లేవు. విజయకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ విలేకరిని వృత్తిపరంగా విమర్శిస్తూ వార్త పెట్టిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..విలేకరి అరుణ్‌పై ఓ వ్యక్తి వృత్తిపరంగా విమర్శిస్తూ జర్నలిస్టు డైరీలో వార్త ప్రచురితమైనట్లు పోస్టు పెట్టాడు. అరుణ్ జర్నలిస్టు డైరీ పత్రిక నిర్వాహకులను సంప్రదించాడు. పత్రిక నిర్వాహకులు తమ పత్రికలో అటువంటి కథనం ఏదీ ప్రచురితం కాలేదని సమాధానం ఇచ్చారు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా ఇంజినీరింగ్ కళాశాల సందర్శన



బాపట్ల: బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలను న్యాకే బృంద సభ్యులు శనివారం పరిశీలించారు. డాక్టర్ వైదేహి విజయ్‌కుమార్ అధ్యక్షతన బృందం కళాశాల్లోని అన్ని విభాగాలను పరిశీలించింది. పూర్వ విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, విభాగపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ అన్నమ్మ మృతి

రేపల్లె రూరల్: పట్టణంలోని 15వ వార్డు మాజీ కౌన్సిలర్ చిక్కాల అన్నమ్మ మంగళవారం మృతి చెందారు. గత కొంత కాలంగా గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు. మృతదేహాన్ని పట్టణంలోని ఆమె స్వగృహానికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, పలువురు కౌన్సిలర్‌లు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సమష్టి కృషితో మండలాభివృద్ధి

చుండూరు(వేమూరు): మండల పరిషత్ అభివృద్ధికి అధికారులంతా పూర్తిగా సహకరించాలని ఎంపీపీ జాలాది రూబేను అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి అనంతరం మాట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల నీరు పొలాల్లో నిలిచిపోవడం జరిగిందన్నారు. డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారులు కాల్వల్లో తూటి కాడలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలవల్ల వ్యాధులు వ్యాపించకుండా ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగరూకులై ఉండాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి వారికి అవగాహన కలిగించాలన్నారు. సర్వ సభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీ దేవి, పరిపాలన అధికారి సుధారాణి, పంచాయతీ రాజ్ ఏఈ గోవర్ధనరావు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రక్షణసైన్యం ద్వారా విస్తృత సేవలు

బాపట్ల: సేవా కార్యక్రమాల్లో రక్షణ సైన్యం 1895వ సంవత్సరం నుంచి విస్తృత సేవలు అందిస్తుందని లెఫ్టినెంట్ కల్నల్ గేరా థామస్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రక్షణసైన్యం ప్రవేశించిన రోజు సందర్భంగా శనివారం విద్యానగర్‌లో జెండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా గేరా థామస్ మాట్లాడుతూ బాపట్ల మండలంలో 34 సంఘాలతో దేవుని సేవ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రక్షణ సైన్యం ఆధ్వర్యంలో సాంఘిక సేవ, విద్య, వైద్యంపై అధిక ప్రాధాన్యత నిచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ గేరా సియోను కుమారి, గేరా మణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.


రక్షణసైన్యం జెండా ఆవిష్కరిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ గేరా థామస్

క్లుప్తంగా

పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే కష్టపడి చదివే తత్వాన్ని అలవర్చుకోవాలని భావపురి బ్రహ్మణ సమాఖ్య అధ్యక్షులు భానుపూడి శ్రీహరి ప్రకాష్ తెలిపారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని పేద విద్యార్థులకు శనివారం నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని రెల్లికాలనీ, రైలుపేట, సీతారామ మున్సిపల్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 100 మందికి, మండలంలోని మరుప్రోలువారిపాలెం ప్రాథమిక పాఠశాలలో 60 మంది పేద విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భావపురి బ్రాహ్మణ సమాఖ్య కార్యవర్గ సభ్యులు సోమరాజు శ్రీనివాస్, కొలను మోహన్, శ్రీకాంత్, రామారావు, హనుమంతరావు, శ్రీరామశర్మ, షణ్ముఖ, గూడా భట్టుశర్మ, శ్రీరామచంద్రమూర్తి, రాంగోపాల్, సుబ్బరామయ్య, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

చెరుకుపల్లి: వర్షాకాలంలో మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యంపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా శాఖల వారీగా మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా మంచినీటి ట్యాంకులు, విద్యుత్ మోటార్లు, తాగునీటి కుళాయిల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. గ్రామాల్లోని పీహెచ్‌సీల వద్ద ఎప్పటికప్పుడు మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులకు తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో సాగునీరు చివరి భూముల వరకు అందేలా కాలువల్లో తూటికాడ, గుర్రపుడెక్క తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ శాంతకుమారి, ఎంఈవోలు పులి లాజర్, టి నవీన్‌కుమార్ మండలంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ఇంటూరు(వేమూరు): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాణ రక్షణ లాంటిదని కోర్టు ఉద్యోగి బొర్రు రవీంద్ర అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ ధరించని కారణంగా వాహనదారులు మరణిస్తున్న సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా పోలీసులు తగు చర్యలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాచారం హక్కుచట్టం మండల కార్యదర్శి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోండి

కర్లపాలెం: సమాచార హక్కు చట్టాన్ని అవసరమైన వారంతా వినియోగించుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు ఏవో సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమాచార హక్కు చట్టం ద్వారా వారికి కావలసిన సమాచారాన్ని పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావటంతో పాటు ప్రభుత్వ యంత్రాగం వద్ద ఉన్న సమాచారాన్ని పొందటానికి సమాచార హక్కు చట్టం ప్రజలకు ఉపయోగ పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, ఎంపీడీవో కె.నేతాజీ, ఫిషరీస్ అధికారి రమేష్, పశువైద్యులు రేచల్ దివ్య, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కర్లపాలెం: తెలుగుదేశం వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణను ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని నక్కలవానిపాలెం టీడీపీ నాయకులు తెలిపారు. పెదగొల్లపాలెం పంచాయతీ నక్కలవానిపాలెంలో గ్రామ టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ నేతృత్వంలో రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంటు సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్‌లు ఆవిష్కరిస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల, పర్చూరు, పొన్నూరు ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.